# వయాగ్రా

-సింహప్రసాద్

విదేశీ వస్తువులమ్మే షాపులు బారులు తీరి వున్నాయి.
అవి స్మగుల్డో, కస్టమ్స్ నోటపైడో తెలీదు.
తనక్కావాల్సిన దానికోసం ఆశగా చూస్తూ కళ్ళతో
వెదికాడు ఆనందరావు.
ఆచూకీ చిక్కలేదు.
చూసుకుంటూ ముందుకెళ్ళాడు. మళ్ళీ
వెనకొచ్చాడు. మళ్ళీ...

అడిగేస్తే బాగుణ్ణనుకున్నాడు. అడగడానికి గొంతులో సంకోచం అడ్డుపడింది.

అతడి వాలకం గమనించి ఒకతను సమీపించాడు.

"బి.ఎఫ్. కేసెట్ వుంది. తీసుకుంటారా?" అతడికి మాత్రమే వినిపించేలా అడిగాడు.

"అంటే..."

"బ్లూఫిల్మ్... చూపిస్తానంటే కొద్దిగా చూపిస్తాను.."

ఆనందరావు తడబడ్డాడు.

"అహా! అది కాదు మరి.. వయాగ్రా

వుందా?

"ఓహ్! వండర్ పిల్ గురించా! చాలా డిమాండ్ వుంది. ముందే బుక్ చేసుకోవాలి. సప్లై చాలా తక్కువగా వుంది. ....."

డీలా పడిపోయాడు ఆనందరావు.

"ఎన్నాళ్ళు పడుతుంది?"

"కనీసం పది రోజులు!

"మైగాడ్! ఇంకో దారి లేదా?

"ఒకాయన టూడజన్స్‌కి ఆర్డరిచ్చాడు. ఒకటి రెండు కావాలంటే అందులోంచి ఇస్తాను. కాని రేటు చాలా ఎక్కువ మరి"

ఉత్సాహం చిగురించగా 'ఎంత?' అని అడిగాడు.

"ఒక్కోటి పదిహేను వందలు..."

"మరీ అంత ఎక్కువా?"

"అమెరికాలోనే పది డాలర్లు. తెలుసా! బంగారం కన్నా ఎక్కువ కష్టపడి తేవాల్సి వస్తోంది".

"వేయి రూపాయిలిస్తాను. ఒకటివ్వు. బాగా పని చేస్తే అప్పుడు..."

"సరే పప్పెంపొందలవ్వు..."

"వుహూ! అక్కడికే చాలా ఎక్కువ..."

ఒక నిమిషం ఆలోచించి రమ్మంటూ సైగ చేశాడు.

లోపలెక్కడో దాచాడు కాబోలు అయిదు నిమిషాలకి తీసుకొచ్చి ఎవరూ చూడకుండా అతడి చేతిలో పెట్టాడు.

ఆనంద రావు కళ్ళు వేయివాట్ల బల్బులయ్యాయి.

చేతిలోని గుళిక అమృత గుళికలా అనిపించింది. గబుక్కున జేబులో దాచేసుకుని డబ్బు తీసిచ్చాడు.

తననెవరూ చూడడం లేదని నిర్ధారణ చేసుకొని గబగబా అడుగులేశాడు.

ఆనందరావూ, అతడి స్వప్నాలూ గాల్లో తేలిపోతున్నాయి.

పెన్నిధిని ఎంచినది దొరికినట్టుగా వుంది.

బస్తీమే సవాల్ అని తొడగొట్టగల శక్తి లభించినట్టుగా వుంది.

వయసు యాభై వైపు మొగ్గు చూపితేనేం! ఇరవై యేళ్ళ యువకునిలా విజృంభించగల మంత్రం-కాదు మంత్రం చేతికి చిక్కినట్టుగా వుంది.

దారిలో నాలుగు మూరల మల్లెపూలు, అరకేజీ స్వీట్సు, అరడజను యాపిల్సు కొన్నాడు.

శోభనపు పెళ్ళికొడుకులా జోరుగా, హుషారుగా ఇంటికెళ్ళి కూనిరాగం తీస్తూ కాలింగ్‌బెల్ నొక్కాడు.

భార్యామణి తలుపుతీసింది.

హాయ్ 'రతీ' డియర్.. అనింకేదో అనపోతుంటే సైగ చేసింది.

గతుక్కుమని లోపలికి తొంగి చూశాడు.

"బాగున్నావా నాయనా" అంది సోఫాకి నడుపడేలా వున్న అత్తగారు.

ఆనందపుపాల పొంగుమీద చెంబెడు నీళ్ళు కుమ్మరించినట్టు చల్లబడిపోయాడు.

పిల్లలంతా వూరికెళ్లారు. చాలా కాలం తర్వాత ఏకాంతం చిక్కింది. పైగా పౌర్ణమి. ఆపైన జేబులో 'వయాగ్రా'. ఇక ఈ రాత్రి వసంత రాత్రే అనుకుంటుంటే శిఖండిలా ఈవిడ వచ్చిపడింది.

మొఖం ముటముటలాడించుకుంటూ "వూ!" అని మూల్గి విసవిసా గదిలోకి వెళ్ళిపోయాడు.

"మీఆయన అలా వున్నాడేమిటే?" ఆనందరావు అత్తగారు అడిగింది.

ముసిముసి నవ్వులు మింగేస్తూ ఆఫీసులో పనెక్కువగా వుండి వుంటుందిలే. నువ్వు కాఫీ త్రాగు అమ్మా!" అంది.

మంచినీళ్ళ గ్లాసుతో గదిలోకెళ్ళింది భారతి.

"నన్నంతా పీక్కుతినేవాళ్ళే! నా ప్రాణానికి సుఖం లేదు. ఈవిడ ఎన్నాళ్ళు తిష్టవేస్తుందట?

"పది నిమిషాలు" నవ్వు బిగబడుతూ అంది.

నిజమా!'

"మీమీదొట్టు. ఇక్కడ మావూరి వారి పెళ్ళి వుంటేనూ పెళ్ళి వారి బస్సులో వచ్చిందట. మీకోసం సున్నివుండలూ, పూతరేకులూ చేసిందట. ఇచ్చి వెడదామని వచ్చింది..."

"అయ్యయ్యో! అలాగా!.. నేనింకా ఏవేదో అనుకుని..."

"ఏవనుకున్నారు? కొంటెగా అడిగింది.

"నీపని ఇప్పుడు కాదు. తర్వాత చెబుతాను..."

బాత్‌రూమ్‌లోకెళ్ళి స్నానం చేసొచ్చాడు. అత్తగారితో తీయని కబుర్లు చెప్పి సాగనంపాడు ఆనందరావు.

"త్వరగా భోజనం చేసేద్దాం!.. ఇవాళ స్పెషల్ ప్రోగ్రాం వుంది..."

చాలా హుషారుగా వున్నారేమిటి విశేషం. ఇంక్రిమెంటు వచ్చిందా?

"ఛత్! ఎప్పుడూ ఉద్యోగమూ! జీతమేనా? అంతకంటే గొప్పది, విలువైనది



ఆనందప్రదాయిని నా దగ్గర వుంది తెలుసా?

"ఏవిటో అది?"

"అది ఇప్పుడు ఇక్కడ చెప్పను. గదిలో మంచం మీద చూపిస్తాను."

"కుర్రాడైపోతున్నారేవిటి ఇవాళ"?

"మేజిక్‌పిల్ తెచ్చానోయ్!. అలా వేసుకుంటే యువకుడైపోతారు తెలుసా?"

"ఎంత తగలేశారేమిటి?"

"ఆనందాన్ని డబ్బుతో కొలవలేం తెలుసా?

"సరిసరే గాని మీకోసం మా అమ్మ బోల్డు నెయ్యి వేసి ఫ్రెష్‌గా చేసిందట 'సున్నివుండలు', ఇవాళ రెండైనా మీచేత తినిపించమన్నది".

"తప్పదా?"

"తప్పదు".

భోజనం ముగించారు.

"త్వరగా తెముల్చుకొనిరా!"

గదిలోకెళ్ళాడు. వయాగ్రా పిల్ బయటికి తీసి అపురూపంగా చూశాడు. చిన్నగా ముద్దుపెట్టుకున్నాడు.

"లలలా లలలా లక్కీ చాన్సులే! అని పాడుకున్నాడు. 'బ్లూమెన్' సెంటు ఒంటికి స్ప్రే చేసుకున్నాడు.

భారతి స్నానం చేస్తోంటే తలుపు దగ్గర గొడవ చేశాడు. ఆమె బాత్‌రూంలోంచి రతీదేవిలా వచ్చింది.

'పిల్లల తల్లిలా లేనేలేవేవు సుమా!"

వెన్నెల కురిసినట్టు నవ్విందామె.

ఆమెని వాటేసుకున్నాడు. ముద్దుల్లో ముంచెత్తాడు. నిలువెల్లా తడిమాడు. రతిరాగాలను శ్రుతిచేశాడు. రెచ్చిపోయాడు. కొంగొత్త శక్తితో నవమన్మథుడైపోయాడు.

అలసిసొలసి పక్కకి తిరిగాడు. డ్రెస్సింగ్‌టేబుల్ మీద 'వయాగ్రా' కనిపించింది.

"అరే! వయాగ్రా వేసుకోనేలేదు. అయినా ఇంత శక్తి ఉత్సాహం.. ఉత్తేజం..."

నవ్విందామె. "సున్నివుండల మహత్యం. అందుకే పెళ్ళిలోనూ, మనుగుడుపుకి వచ్చినప్పుడూ అవి తప్పకుండా పెడుతుంటారు. మినుములు, నెయ్యి, బెల్లం వగైరాలు గురించి మన పూర్వులకి బాగా తెలుసు. ఆయుర్వేద శాస్త్రంలో కూడా పటుత్వానికి, ధాతుపుష్టికీ, పురుషత్వానికీ ససున్నివుండలు భేషుగ్గా పనిచేస్తాయని రాసివుందిట..."

"అంటే సున్నివుండలు ఇండియన్ వయాగ్రా అన్నమాట".

"వయాగ్రా అంటే?"

"పుంసత్వాన్ని అరగంటలో పెంచే ఒక మాత్ర. అది వేసుకుంటే దాని ప్రభావం వుంటుంది."

"మనకవి అనవసరం. మనకి సైడ్ ఎఫెక్ట్స్ రానివ్వకుండా, ఆరోగ్యాన్ని పెంచి ధృఢంగా వుంచే సున్నివుండల్ని మించింది లేదు. భారతీ నాకో సున్నివుండ ఇవ్వవూ!

వరాలిచ్చే శృంగార దేవతలా నవ్వింది భారతి.

తపస్సు ఫలించిన వాడిలా ఆమెని మళ్ళీ వాటేసుకున్నాడు 'ఆనందంగా'

★